## క్లుప్తంగా

### నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామ గౌడ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బద్దం యాదగిరిగౌడ్, ఉపాధ్యక్షుడిగా పిట్టల వెంకన్నగౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఉయ్యాల వెంకన్న, సహాయ కార్యదర్శులుగా ఉయ్యాల అంజయ్య, మల్లెబోయిన నర్సయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పిట్టల అంజయ్య, ఉయ్యాల రాము, కె.సాయి, రవి, జాని, సుందర్, గోవర్ధన్, నాగరాజు, భిక్షం, శ్రవణ్, శ్రీరాములు, సైదులు, లింగయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

### గ్రంథాలయ భవన నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న మందుల సామేలు

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం రూ.15,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రంథాలయానికి కావాల్సిన సడ్డీ మెటీరియల్ కూడా అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరాల యాదగిరి, కుమార్, వెంకన్న, రమేష్, అనిల్, అవిలమల్లు పాల్గొన్నారు.

### చెవిటి వెంకన్నకు సన్మానం



చెవిటి వెంకన్నను సన్మానిస్తున్న నాయకులు

నూతనకల్ : జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన చెవిటి వెంకన్న యాదవ్‌ను మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటున్న చెవిటి వెంకన్నను అధ్యక్షుడిగా నియమించడంపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కళ్లెం కృష్ణారెడ్డి, బండపల్లి సాగర్, జటంగి గణేష్, పసుల అశోక్‌యాదవ్, బొడ్డుపల్లి అంజయ్య, జూలూరి కేశవచారి పాల్గొన్నారు.

### ఈదురుగాలులకు దెబ్బతిన్న ఇల్లు పరిశీలన



ఈదురుగాలులకు పైకప్పు లేచిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్

నాగారం : మండల పరిధిలోని ఈటూరులో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం వల్ల గ్రామానికి చెందిన తీగుళ్ల సోమయ్య రేకుల ఇంటి పైకప్పు లేచిపోయింది. ఈ సందర్భంగా బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం స్థానిక తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ ఆ ఇంటిని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

### సీపీఐ నాయకుడి మృతికి సంతాపం

చిలుకూరు : సీపీఐ సీనియర్ నాయకుడు, గీత పనివారల సంఘం నాయకుడు కొండా పిచ్చయ్య మృతికి ఆదివారం పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహంపై సీపీఐ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు, గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా కోటయ్య, దొడ్డా వెంకటయ్య, బాలేబోయిన రాంబాబు, సుల్తాన్ వెంకటేశ్వర్లు, కస్తూరి సత్యం, సిరాపురపు శ్రీను, రవితో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

నడిగూడెం : ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి కేసగాని భద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కరివిరాలలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజు రోజుకూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుందని, అర్హతను బట్టి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం ప్రథమ కర్తవ్యం

- గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్‌తో పారిశుద్ధ్య కార్యక్రమాలు
- ముమ్మరంగా కొనసాగుతున్న పనులు
- పర్యవేక్షిస్తున్న అధికారులు, సర్పంచ్‌లు



పెన్‌పహాడ్‌లో డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



అనంతారంలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న కార్మికులు

పెన్‌పహాడ్ : గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పర్చడమే లక్ష్యంగా అధికారులు, పంచాయతీలు ముందుకు కదిలాయి. పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంతో ఏడు రోజుల పాటు చేపట్టే కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని అన్ని పంచాయతీల్లో చేపడుతున్న పనుల ద్వారా ఇప్పటికే గ్రామాల్లో రూపురేఖలు మారుతున్నాయి. ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలతో పాటు పేరుకుపోయిన పలు సమస్యలను పరిష్కరిస్తున్నారు. దీని కోసం ఆయా పంచాయతీల వారీగా సర్పంచ్‌లు, సిబ్బంది పనులను వేగంగా చేయిస్తున్నారు. ఈ నెల 17 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం 23వరకు చేపట్టనున్నారు.

**డ్రైయినేజీ నుంచి శ్మశాన వాటిక వరకు..**

గ్రామంలో డ్రెయినేజీలు మొదలుకొని శ్మశాన వాటికలలో ఉన్న పలు సమస్యల వరకు అన్నింటి పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. గ్రామంలోని రోడ్లపై గుంతలు పూడ్చడం, కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తీసేయడం, శ్మశాన వాటిక వద్ద పెరిగిన కంపచెట్లను తొలగించడం, రానున్న వర్షాకాలంలో ఇబ్బందులు కలుగకుండా రోడ్లను బాగు చేయడం, ఇంకుడుగుంతల ప్రాధాన్యం వివరిస్తూ, గుంతలు తీసుకోని వారికి కొత్తగా ఇంకుడుగుంతలు తీయించడం, పాత మిద్దెలు, కూలిన ఇళ్లను తొలగించే పనులను ముమ్మరంగా చేస్తున్నారు. ప్రధానంగా నీటి ట్యాంకులు, కుళాయిల వద్ద పేరుకుపోయిన మురుగును, గడ్డిని తొలగించి శుభ్రం చేస్తున్నారు. ఇలాంటి పనులు గ్రామాల్లో నిరంతరం చేస్తున్నప్పటికీ కొన్ని సమస్యలు పరిష్కరించేందుకు వీలు కాకపోవడంతో నిలిచిపోతున్నాయని, వాటిని కూడా ప్రత్యేక డ్రైవ్‌లో పరిష్కరిస్తున్నామని సర్పంచ్‌లు తెలుపుతున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కూలేందుకు సిద్ధంగా ఉన్న మిద్దెలు, ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, వాటి ద్వారా ఇబ్బందులు రాకుండా కూలగొట్టడమే కాకుండా, పాడుబడిన బావులను పూడ్చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన నర్సరీలపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

**పిచ్చి మొక్కల తొలగింపు..**

గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్ల వెంబడి పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో ప్రత్యేకంగా కూలీలను నియమించి మొక్కల తొలగింపును చేపట్టారు. గ్రామాల్లో ఇంటింటా సందర్శించి ఉపయోగంలో లేని వస్తువులు, చెత్తకుప్పలు, వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తొలగిస్తున్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా లోతట్టు ప్రాంతాల్లో మట్టిని నింపుతామని, ఎప్పటికప్పుడు శుభ్రతపై దృష్టిసారించినట్లు అధికారులు చెబుతున్నారు.

**సమస్యలకు పరిష్కారం**



గ్రామల్లో ప్రత్యేక డ్రైవ్ ద్వారా చాలా సమస్యలు పరిష్కారమవుతున్నాయి. కొన్ని పనులు ప్రతి నెలా చేస్తున్నప్పటికీ పాత బావులు పూడ్చడం వంటి పనులు చేపడుతున్నాం. ఏళ్ల తరబడి కొన్ని ఇళ్ల వద్ద, ఖాళీ స్థలాల వద్ద మురుగు సమస్యలు తీరుతున్నాయి. ప్రత్యేకంగా తాగునీటి నల్లాలు వద్ద మొదలుకొని గ్రామం మొత్తం బ్లీచింగ్ చల్లడం వల్ల ప్రజలు కూడా వీధులను శుభ్రంగా ఉంచుకుంటున్నారు.

\- బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్, అనంతారం

**పనులు చేయిస్తున్నాం**



ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ద్వారా చేస్తున్న పనులు గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. నర్సరీలు, ముళ్ల చెట్ల తొలగింపు, శ్మశాన వాటికకు సంబంధించిన పలు పనులు చేయిస్తున్నాం. ప్రజలు కూడా సహకరిస్తున్నారు.

\- నరేష్, ఎంపీఓ

## ఉద్యమ ఆకాంక్షలను నీరుగార్చిన కేసీఆర్



మాట్లాడుతున్న ధర్మార్జున్

భానుపురి : తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను సీఎం కేసీఆర్ నీరుగార్చారని, అమరవీరుల బలిదానాలను అవమానపరిచారని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట నియోజకవర్గ అభ్యర్థి కుంట్ల ధర్మార్జున్ విమర్శించారు. జూన్ 4న సూర్యాపేటలో నిర్వహించే తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్లీనరీ ఏర్పాట్లలో భాగంగా ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సూర్యాపేట నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ముఖం పెట్టుకొని ఘనంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తారని కేసీఆర్‌ను ప్రశ్నించారు. నిధులను దుబారా చేస్తూ తెలంగాణను అప్పులపాలు చేశారని, రైతుబంధు పేరుతో మొత్తం వ్యవసాయాన్ని కుప్పకూలుస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గట్ల రమాశంకర్, జిల్లా అధ్యక్షుడు మాండ్ర మల్లయ్య, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్, లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ కుంచం చంద్రకాంత్, నాయకులు వీరేష్‌నాయక్, బచ్చలకూరి గోపి, రఫీ, కొల్లు కృష్ణారెడ్డి, జాటోత్ శ్రీను నాయక్, సుమన్ నాయక్, అంగోత్ సూర్యనారాయణ, బంధన్ నాయక్, వల్కి రాజు, యాకూబ్ రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ పార్టీ మునిగిపోతున్న పడవ



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

భానుపురి : బీఆర్‌ఎస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, ప్రస్తుతం బీఆర్‌ఎస్ మునిగిపోతున్న పడవ అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 43వ వార్డులో కౌన్సిలర్ నామ అరుణ ప్రవీణ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకుడు గుంజ శ్రీనివాస్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సూర్యాపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి డిపాజిట్ కూడా రాదని, అనేకమంది బీఆర్‌ఎస్ నాయకులు త్వరలోనే కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడం ఖాయమన్నారు. తెలంగాణ రాష్ట్రం కేవలం నలుగురి కోసం మాత్రమే వచ్చిందన్న భావన ప్రజల్లో ఏర్పడిందన్నారు. జిల్లాలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆయన బినామీలు మాత్రమే రాష్ట్ర ఫలాలను అనుభవిస్తున్నారని విమర్శించారు. పట్టణంలో మంచినీటి సౌకర్యం లేదని, దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని తెలిపారు. 43వ వార్డులో కమ్యూనిటీ హాల్ నిర్మించి ప్రజలకు అందుబాటులో తెస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంజ శ్రీనివాస్, రాంబాబు, రవి, మొక్కల రవి, గుంజ వంశీ, భక్తుల సాయికిరణ్, జగన్, మహేష్, విక్కీ, ఉదయ్, శివమ్మ, వరలక్ష్మి, గంగమ్మ, రంగమ్మ, సైదులు, బాబు, నాగరాజు, లక్ష్మయ్య, యశ్వంతు, విజయ్, జయమ్మ, స్వప్న, అనసూయ, కుమారి, కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి వార్షిక వేడుకలు



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

నాగారం : మండల పరిధిలోని పేరబోయినగూడెంలో బొడ్రాయి 5వ వార్షికోత్సవాన్ని ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, జలాభిషేకం చేశారు. అలాగే ఆంజనేయస్వామి ఆలయం వద్ద హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కాశీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ తీగుళ్ల స్వరూపప్రశాంత్, ఉపసర్పంచ్ కడారి సత్తయ్య, దాసరి సుగుణమ్మ, దాసరి వెంకన్న, ఉప్పుల రాంమూర్తి, కాశబోయిన సురేష్, పేరబోయిన సంతోష్, మహేష్, వీరేష్, చింతల యాకమల్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అడ్వకేట్ యుగేంధర్‌పై దాడి అమానుషం



తిరుమలగిరి : ఎస్‌ఐ శివకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

నాగారం : అడ్వకేట్ యుగేంధర్‌పై బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడికి పాల్పడటం అమానుషమని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుమలగిరిలో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే దళితులను కించపర్చేలా వ్యాఖ్యలు చేయడాన్ని ప్రశ్నించడంతోనే బీఆర్‌ఎస్ కార్యకర్తలు యుగేంధర్‌పై దాడి చేశారని అన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్‌పార్టీ నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, నాతి వీరమల్లు, ఎల్మకంటి సోమన్న, పంది శ్రీను, వలీ తదితరులు ఉన్నారు.

**దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి**

తిరుమలగిరి : న్యాయవాది యుగేంధర్‌పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అఖిలపక్షం నాయకులు ఆదివారం తిరుమలగిరి సబ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌కు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గుడిపాటి నర్సయ్య, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమయ్య, కడెం లింగయ్య, రైతులు సునీల్ మాదిగ, బీఎస్పీ మండల శాఖ అధ్యక్షుడు మల్లెపాక కృష్ణ, వై.నరేష్, కందుకూరి అంబేద్కర్, శ్రీను, వీరేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జనార్దన్ జీవితం నేటి యువతకు ఆదర్శం



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు (ఎస్) : భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసి పోరాడిన జలగం జనార్దన్ జీవితం నేటి యువతకు ఆదర్శమని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. ఆదివారం జలగం జనార్దన్ రెండో వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఉద్యమాలకు సుపరిచితుడుగా జనార్దన్ నిలిచారన్నారు. దశాబ్దాలకు పైగా అజ్ఞాతంలో ఉండి ఉద్యమాలకు నాయకత్వం వహించారని, ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సక్క, పోతురాజు ప్రతాప్, పిట్టల లింగయ్య, వరికుప్పల మల్లయ్య, రాములు, వరికుప్పల మంగమ్మ, మేకల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మకూర్ (ఎస్) : పాతర్లపహాడ్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని పాతర్లపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992-93 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మండలంలోని నెమ్మికల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు యాదగిరి, శ్రీహరి, పూర్వ విద్యార్థులు తూడి జనార్దన్, తంగెళ్ల నరేందర్‌రెడ్డి, వీరశేఖర్, శంకర్, బాబురావు, సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, మురళి, కృష్ణయ్య, రంగయ్య, రవి, జానయ్య, శశిధర్, రామనర్సయ్య, బాలస్వామి, జానకిరాములు, వెంకటేశ్వర్లు, ప్రభావతి, శ్రీదేవి, విజయ పాల్గొన్నారు.

తిరుమలగిరి : తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984 విద్యాసంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

## మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళులు



తిరుమలగిరి : రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెన్‌పహాడ్ : దూపహాడ్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



నూతనకల్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిరుమలగిరి : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పీసీసీ సభ్యుడు గుడిపాటి నర్సయ్య మాట్లాడారు. భారతదేశానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేసిన వ్యక్తి రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, ఎండీ.హాఫీజ్, ఎంపీటీసీ సభ్యుడు జమ్మిలాల్, మల్లయ్య, సోమనర్సయ్య, వీరేష్, మల్లయ్య, అబ్బాస్, లింగయ్య, కృష్ణ, నర్సింహ, సుధాకర్, ఉపేందర్, చంటి పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : స్వర్గీయ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు అన్నారు. ఆదివారం రాజీవ్ వర్ధంతి సందర్భంగా దూపహాడ్ గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డి కేశవులు, భూక్య సందీప్ రాథోడ్, పెద్దపోలు వెంకన్న, పిన్నెని జనార్దన్, రవీందర్ నాయక్, సైదులు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన రాజీవ్ వర్ధంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కళ్లెం కృష్ణారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, జటంగి గణేష్, తుంగతుర్తి విద్యాసాగర్‌రావు, బంటు బద్రి, జూలూరి కేశవచారి, ఇమ్మారెడ్డి లింగారెడ్డి, సాబాది ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అర్వపల్లిలో మురుగు కాలువలను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది



మద్దిరాల : ముకుందాపురంలో డ్రెయినేజీలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికుడు

మద్దిరాల : గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సరోజ అన్నారు. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వీధుల వెంట ఉన్న కలుపు మొక్కలను తొలగించే పనులు చేయించారు. డ్రెయినేజీలలో ఉన్న మట్టిని తీసివేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించి శానిటేషన్ చేసినట్లు తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిలువకుండా చూసుకోవాలని, లేదంటే దోమలు, ఈగలు చేరి అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తేజశ్రీ, లలిత, ఉమ, మంగ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని అర్వపల్లి, రామన్నగూడెం తదితర గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఎంపీఓ ఉపేందర్‌రావు పరిశీలించారు. మురుగు కాలువలు, వీధులను శుభ్రం చేయాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బైరబోయిన సునీతారామలింగయ్య, పీరమ్మ, కార్యదర్శి మాగి నాగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### నిరుద్యోగుల వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు

చిలుకూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న యువజన, నిరుద్యోగుల వ్యతిరేక విధానాలపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో త్వరలో ఉద్యమాలు చేయనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు అన్నారు. ఆదివారం చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామంలో ఏఐవైఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వజ్రపు శ్యామ్, ఉపాధ్యక్షులుగా రెడపంగు మహేష్, కొండా సైదులు, ప్రధాన కార్యదర్శిగా ముస్కుల శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రెమిడాల శశి, శ్రావణ్, షేక్ ఫకుర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెమిడాల రాజు, కాంపాటి వెంకటయ్య, జావేద్ పాల్గొన్నారు.

### ముత్యాలమ్మ పండుగ

చిలుకూరు : కొత్త చిలుకూరులో ఆదివారం ముత్యాలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయి, ముత్యాలమ్మ దేవాలయాల వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.

### బీసీ విద్యార్థి సంఘం బలోపేతానికి కృషి చేయాలి

అనంతగిరి : బీసీ విద్యార్థి సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ అన్నారు. ఆదివారం అనంతగిరి మండల కేంద్రంలో నిర్వహించిన బీసీ విద్యార్థి సంఘం సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షుడిగా చింతల మహేందర్, ప్రధాన కార్యదర్శిగా వేముల గోపి, ఉపాధ్యక్షులుగా బండి గోపిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు బచ్చురాజ్యం, బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాలంపల్లి సుధాకర్ గౌడ్, పల్లపు మణెమ్మ, వెంకటలక్ష్మి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ యూత్ నూతన కమిటీ ఎన్నిక

అనంతగిరి : మండల పరిధిలోని అమీనాబాద్‌లో అంబేడ్కర్ యూత్ నూతన కమిటీ అధ్యక్షుడిగా దేవపంగు రవిప్రసాద్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన యూత్ అధ్యక్షుడు రవిప్రసాద్ మాట్లాడారు. కమిటీ ప్రధాన కార్యదర్శిగా దుడ్డెల నరేష్(కిక్కు), ఉపాధ్యక్షుడిగా దాసరి వంశీ, కోశాధికారిగా మీసాల రాజేష్, ప్రచార కార్యదర్శిగా రేపాల రమేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైస్‌ప్రెసిడెంట్ దేవపంగు కృష్ణ, దుడ్డెల వెంకటేశ్వర్లు, రంజిత్, మీసాల విజయ్, వెంకట్రావ్, సాయి, మనోజ్, నితిన్, నిఖిల్, మధు, సతీష్, నిఖిల్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## తండావాసులంతా ఫంక్షన్ పనులకే..



అర్వపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో భోజనాలు వడ్డిస్తున్న క్యాటరింగ్ సిబ్బంది

అర్వపల్లి : ఆ తండాకు చెందిన వారంతా దాదాపు ఫంక్షన్‌లలో పనిచేసే కార్మికులే. వంట మాస్టర్లు మొదలుకొని సప్లయర్‌లు, క్యాటరింగ్, శుభ్రం చేయడం, మంచినీళ్లు అందించడం.. ఇలా ఫంక్షన్‌లలో చేసే ప్రతి పనిని వీరే చేస్తుంటారు. జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామంలోని తండాలో సుమారు 350 మంది జనాభా ఉంటుంది. వీరిలో యువకుల నుంచి వృద్ధుల వరకు ఫంక్షన్‌లు (కార్యాలు) నిర్వహించే కార్మికులే. ఫంక్షన్‌లు అంటే పుట్టిన రోజు మొదలుకొని పెళ్లిళ్లు, దశదినకర్మలు, పేరంటాలు, ఇతర కార్యాలు ఏవి జరిగినా ఈ ప్రాంతంలో ఈతండా వాసులంతా ఆ పనులకు వెళ్తారు. సుమారు 150 మందికిపైగానే నిత్యం తండా నుంచి ఎక్కడ ఫంక్షన్‌లు జరిగినా ఉదయం వెళ్లి కార్యం అయ్యాక తిరిగి రాత్రికి ఇంటికి చేరుకుంటారు.

**గత కొన్నేళ్లుగా ఇదే పని..**

ఈ తండా గిరిజనులు గత ఐదారేళ్లకు పై నుంచి ఫంక్షన్‌ల పనులకు వెళుతున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంతోపాటు సూర్యాపేట నియోజకవర్గంలో కూడా ప్రతి రోజు ఆర్డర్‌లను బట్టి ఫంక్షన్‌ల పనులకు వెళుతుంటారు. తమకు ఈ ఫంక్షన్‌ల పనులే ఉపాధి కల్పిస్తున్నాయని తండా గిరిజనులు పేర్కొంటున్నారు. కుటుంబాలకు కుటుంబాలే కలిసి వెళ్లి ఈ ఫంక్షన్‌ల పనుల్లో సేవలందిస్తుంటారు.

**రోజుకు రూ. 400 కూలి**



గత కొన్నేళ్లుగా నేను ఫంక్షన్‌ల పనులకు వెళుతున్నాను. ప్రస్తుతం రోజుకు కూలి రూ. 400 వరకు ఇస్తున్నారు. ఉదయం వెళ్లి రాత్రికి ఇంటికి వస్తాం.

\- రమావత్ కౌసల్య, కార్మికురాలు

**ఫంక్షన్‌ల పనికి వెళ్తాం**



మా తండాలో పనులు లేక భార్యభర్తలమిద్దరం రోజూ ఫంక్షన్‌ల పనులకు వెళ్తుంటాం. నా భర్తకు రూ. 500, నాకు రూ. 400 చొప్పున కూలి వస్తుంది.

\- బుల్లి, కార్మికురాలు

**ఫంక్షన్‌లు ఉంటేనే పనులు**



ఫంక్షన్లు ఉన్నప్పుడే మాకు పని దొరుకుతుంది. ఇవి లేకపోతే ఖాళీగా ఉండాల్సి వస్తుంది. క్యాటరింగ్ పనులకు వచ్చే కూలి చాలడం లేదు.

\- లునావత్ గబ్బర్‌సింగ్